
సాక్షి ఒడిశా

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదురూ.3,64,346 , బంగారం 4 గ్రాముల 200 మిల్లీ గ్రాములు , వెండి6 గ్రాముల 200 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రూ.8 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

గజపతి జిల్లాలోని మోహనా పోలీసుస్టేషన్‌కు సమీపంలో పెట్రోలింగ్ సిబ్బందికి రూ.8 కోట్ల విలువైన గంజాయి సోమవారం పట్టుబడింది. - 8లో

సీడబ్ల్యూసీలో రాష్ట్ర ప్రాతినిథ్యం శూన్యం

కాంగ్రెస్ కార్యనిర్వాహక కమిటీ (సీడబ్ల్యూసీ) పునర్వ్యవస్థీకరణ రాష్ట్ర నేతల్లో తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. అత్యున్నత నిర్ణాయక సంఘంలో రాష్ట్రం నుంచి ఎవరికీ చోటు కల్పించకపోవడంతో అసంతృప్తి సెగలు రేగుతున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో రూపొందిన కొత్త కార్యనిర్వాహక కమిటీలో రాష్ట్ర నాయకులకు స్థానం దక్కపోవడంపై నాయకులు బాహాటంగానే పెదవి విరుస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నాటుసారా అక్రమ రవాణా

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు



నాటుసారాతో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక ద్విచక్ర వాహనంపై అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అభిరాం బెహర ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆశీర్వాద్ బెహర నేతృత్వంలో జరిగిన దాడుల్లో సారిషాపాదొరొ నుంచి నాటుసారాను తీసుకొస్తున్న కొరాపుట్ జిల్లా దస్మంత్‌పూర్ సమితి డుమ్మాగుడ గ్రామానికి చెందిన బొనొమాలి బిసొయి, కృష్ణ చంద్ర బిసొయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 65 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలియజేశారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చోరీ కేసులో అరెస్టైన నిందితుడు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి గుణుపూర్ పోలీసులు నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 9వ తేదీన గుణుపూర్‌కు చెందిన వినాయక్ అగ్రవాల్ అనే వ్యాపారి తన వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఒక పికప్ వ్యాన్‌లో సామాన్లు లోడ్ చేస్తున్నాడు. ఈ సమయంలో డ్రైవర్ క్యాబిన్‌లో బ్యాగ్‌తో ఉన్నటువంటి రూ.80 వేల నగదు చోరీకి గురయ్యింది. దీనిపై గుణుపూర్ ఆదర్శ పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి పెంట గ్రామానికి చెందిన కామదేవ్ నాయక్ (29)ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి పోలీసులు రూ.80 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సోమవారం కోర్టుకు తరలించారు.

ఎట్టకేలకు మృతదేహం లభ్యం



చంపావతి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

జయపురం: బొయిపరిగుడ సమితి మొసిగాం గ్రామ పంచాయతీ బొరగాం గ్రామం వద్దనున్న కొలాబ్ నదిలో గల్లంతైన చంపావతి హరిజన్ మృతదేహం ఎట్టకేలకు సోమవారం లభించింది. నదిలో కొట్టుకుపోయి ఉంటుందని భావించిన గ్రామస్తులు ఈ విషయం కుంద్రా అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా నదిలో గాలించారు. అయితే కొంతమంది గ్రామస్తులు మరుభూమికి కొలాబ్ నది సమీపంలోకి వెళ్లగా మృతదేహం కనిపించడంతో గుర్తు పట్టారు. విషయాన్ని గ్రామ ప్రజలకు తెలియజేయగా వెంటనే పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె భర్తకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

నారాయణపట్న మాజీ బీడీవో అరెస్టు



రమేష్ చంద్ర బిసోయి

కొరాపుట్: జిల్లాలోని నారాయణపట్న మాజీ బీడీవో రమేష్ చంద్ర బిసోయిని న్యూఢిల్లీలో అరెస్ట్ చేశారు. సోమవారం విజిలెన్స్ ఎస్పీ వేణుగోపాల్ నాయక్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్‌ల బృందం రమేష్‌ని అదుపులోకి తీసుకున్నారు. న్యూఢిల్లీ హైకోర్టులో ప్రవేశపెట్టి ట్రాన్సిట్ రిమాండ్ తీసుకొని కొరాపుట్ జిల్లాకు తీసుకొస్తున్నారు. ఆయన ఇదివరకు నారాయణపట్న బీడీవోగా పనిచేస్తూ లక్షలాది రూపాయుల ప్రభుత్వ ధనం దారి మళ్లించారు. అనేక నిర్మాణాలు చేపట్టకుండానే నిధులు కైంకర్యం చేశారు. దీంతో విజిలెన్స్ శాఖ దర్యాప్తు చేసి 7 కేసులు నమోదు చేసింది. కేసులు విచారణలో ఉండగా శిక్ష తప్పదని భావించిన రమేష్ పరారీ అయ్యారు. 2015 సంవత్సరం నుంచి అస్సాం తదితర ప్రాంతాల్లో తల దాచుకున్నారు. ఇటీవల న్యూఢిల్లీ వచ్చారని తెలిసి విజిలెన్స్ శాఖ అధికారులు పట్టుకున్నారు.

చిట్టి మాటలు... గట్టిమేలు తల పెట్టెనోయ్...!



వేదికపై ఉన్నతాధికారులకు సమస్యలు వివరిస్తున్న సోనాలి

- స్వాతంత్య్ర వేడుకల్లో సమస్యలు ఏకరువు పెట్టిన చిన్నారి
- వైరల్ అయిన వీడియో
- రాష్ట్రవ్యాప్తంగా అధికారుల కలవరం
- గిరిజన గ్రామంలో సౌకర్యాల కల్పనకు చర్యలు

కొరాపుట్: స్వాతంత్ర్య దినోత్సవం రోజున నాలుగేళ్ల చిన్నారి మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రస్తుతం తీవ్ర కలవరుపాటుకి గురిచేస్తున్నాయి. ముద్దుముద్దు మాటలు, ఆవేదన సోషల్ మీడియాను షేక్ చేస్తుండడంతో, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఆరోపణలు ఎక్కుపెడుతున్నాయి. ఇన్నేళ్ల బీజేడీ పాలనలో ప్రజలకు ఎటువంటి మేలూ జరగలేదని ఆరోపణలు గుప్పిస్తున్నాయి. అదే సమయంలో సమస్యలు పరిష్కరిచేందుకు అధికారులు పరుగులు తీస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే...

అగస్టు 15వ తేదీన కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జిల్లాస్థాయి ఉత్సవాలు జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్ హాజరయ్యారు. ఆయనతో పాటు కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్, ఎస్పీ అభినవ శంకర్, ఎస్డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మజ్జి ఉత్సవాలు తిలకిస్తున్నారు. ఇదే సమయంలో ఫ్యాన్సీ డ్రెస్‌లో ఏకపాత్రాభినయం పోటీలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా కొరాపుట్ సరస్వతీ శిశు మందిర్‌లో చదువుతున్న నాలుగేళ్ల చిన్నారి సోనాలి దాస్ కొరాపుట్ గిరిజన యువతి వేషాధారణలో విచ్చేసింది. ఆమె ముద్దుముద్దు మాటలతో జిల్లాలోని దశమంత్‌పూర్ సమితి ఉల్లా గ్రామ పంచాయతీ పొద్దుగూడ గ్రామంలో గిరిజనులు పడుతున్న సమస్యలను గిరిజన భాషలో ఏకరువు పెట్టింది. ఆహుతులంతా ఆమె మాటలకు మురిసిపోయి, నవ్వులు చిందించారు. మంత్రి ఆ పాపను దగ్గరకు తీసుకొని అభినందించారు. కానీ ఆ తర్వాత ఊహించని విధంగా పరిస్థితులు మారిపోయాయి.



పొద్దుగుడ గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న ఉన్నతాధికారులు

సమస్యల పొద్దుగుడ

కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి ఉల్లా గ్రామ పంచాయతీలో పొద్దుగుడ గ్రామం ఉంది. అక్కడ 70 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆ గ్రామానికి రోడ్డు లేదు. దీంతో గిరిజనులు అటవీ మార్గంలో కాలిబాటను అనుసరిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవనం ఇప్పటికీ నిర్మాణం పూర్తి చేసుకోలేదు. గ్రామానికి కేవలం రెండే తాగునీటి పైపులు ఉండగా, అందులో ఒకటి పనిచేయడం లేదు. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు ఇచ్చినా ఆ గ్రామం వైపు రావడం లేదు. గ్రామానికి విద్యా, వైద్యం, విద్యుత్ సదుపాయాలు లేవు. రేషన్ బియ్యం తీసుకోవాలంటే సుమారు 3 కిలోమీటర్లు నడవాల్సిందే. నిజానికి ఆ గ్రామానికి ద్విచక్ర వాహనం కూడా వెళ్లే మార్గం లేదు. ఒక్క అధికారి కూడా ఆ గ్రామన్ని ఏనాడు సందర్శించలేదు. గిరిజనుల విజ్ఞప్తులు పట్టించుకునే నాథుడు లేదు. అనేక అనారోగ్య మరణాలు కొనసాగుతున్నాయి. దీనిపై ఆ చిన్నారి మాట్లాడడంతో వీడియో రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వైరల్ అయ్యింది.

చిన్నారిని కదలించిన కథనాలు

వీడియోలో మాట్లాడిన చిన్నారి కోసం మీడియా ఆరా తీయగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. పొద్దుగుడ గ్రామం గిరిజనులు పడుతున్న బాధలకు, చిన్నారికి ఎటువంటి సంబంధం లేదు. గత కొంతకాలంగా ఆ గ్రామ ప్రజలు ప్రభుత్వ సహకారం లేకుండా పడుతున్న బాధలు చిన్నారిని కదలించాయి. మీడియాలో ప్రసారమైన ఆ కథనాలతో ఆమె ఏక పాత్రాభినయం చేసింది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సొనాలి స్థానిక సరస్వతి శిశు మందిర్ చదువుకుటోంది. స్కూల్ తరుపున స్టేడియంలో ఏకపాత్రాభినయంకు అవకాశం రావడంతో అదుర్స్ అనిపించింది.

చిన్నారి మాటలు వైరల్

కార్యక్రమం అనంతరం చిన్నారి మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ పసిపాప గిరిజనుల కన్నీటి గోడును బాహ్య ప్రపంచానికి తెలిసేలా చేసింది. ఆ వీడియో రాష్ట్రంలోని ప్రముఖ టీవీ ఛానెల్లు ప్రైమ్ టైమ్‌లో ప్రసారం చేశాయి. చిన్నారి తన మాటలతో మంత్రులు, ఉన్నత బ్యూరోక్రాట్లను వేదికపై నుంచే ప్రశ్నించడంపై రాష్ట్రమంతా విస్తుపోయింది. ఇదే సమయంలో రాష్ట్ర స్వాతంత్ర్య మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి ఈ వీడియోపై స్పందించారు. బాలిక గిరిజనుల సమస్యలు ఏకరువు పెడుతుంటే మంత్రితో సహా అధికారులు నవ్వులు చిందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షాత్తు క్యాబినేట్ హోదాతో కూడిన పదవిలో ఉన్న ప్రదీప్ మజ్జి సొంత ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో బాలిక సోనాలి వీడియోకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది.




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చిన్నారికి స్వీట్ తినిపిస్తున్న చంద్రశేఖర్ మజ్జి

కదిలిన అధికార యంత్రాంగం

చివరకు అన్నివర్గాల్లో సోనాలికి భారీగా మద్దతు లభిస్తుండడతో కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ నష్ట నివారణ చర్యలు కోసం రంగంలోకి దిగారు. తక్షణమే అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి ఆమె పేర్కొన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆదివారం దశమంత్‌పూర్ బీడీవో డోంబుదర్ నాయక్ నేతృత్వంలో విద్యా, వైద్య, రెవెన్యూ, రహదారులు, తాగునీటి, పౌర సరఫరాల, విద్యుత్ తదితర శాఖల అధికారులు గ్రామానికి పరుగు తీశారు. వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో కాలి నడకన గ్రామానికి చేరుకున్నారు. ఇంటింటినీ సందర్శించారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఏ ప్రభుత్వ ఉద్యోగీ తమ గ్రామానికి ఏనాడూ రాలేదు కానీ, ఇప్పుడు ఒకేసారి అన్ని శాఖల అధికారులు వస్తుండడంతో గిరిజనులు ఆశ్చర్యానికి గురయ్యారు. వారికి కొందరు సోనాలి వీడియో చూపించడంతో కన్నీటి పర్యంతమయ్యారు. తమకు తెలియని, తమ గ్రామాన్ని ఏనాడు చూడని కేవలం నాలుగేళ్ల చిన్నారి గ్రామ సమస్యలు వివరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమస్యలపై అధికారులు పూర్తి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.


50 గ్రాముల బ్రౌన్ షుగర్ సీజ్



పట్టుబడిన బ్రౌన్ షుగర్

బరంపురం: నగరంలో రోజురోజుకీ బ్రౌన్ షుగర్ మాఫియా విస్తరిస్తోంది. సోమవారం శ్రీరామ్ నగర్‌లో ఎక్సైజ్ గోవింద విభాగం అధికారులు దాడులు నిర్వహించి 50 గ్రాముల బ్రౌన్ షుగర్ సీజ్ చేశారు. బరంపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర మిశ్రా తెలిపిన వివరాల మేరకు.. శ్రీరామ్ నగర్ జంక్షన్‌లో బ్రౌన్ షుగర్ చలామణిలో ఉన్నట్లు సమాచారం మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అశిష్ కుమార్ సింగ్ ఆదేశాలతో ఎక్సైజ్ అధికారి రమేంద్ర నారాయణ నాయక్ నాయకత్వంలో దాడుల నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా సరఫరా చేస్తున్న 50 గ్రాముల బ్రౌన్ షుగర్ సీజ్‌చేసి, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి శ్రీరామ్ నగర్‌కి చెందిన మహేశ్వర్ మహంతిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. దీనివిలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

పూరీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్



- ఎఫ్ఐఆర్ నమోదు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఈ మేరకు కళాశాల డీన్ మరియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మాయా పాఢి పెంటకోట మెరైన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థి అభిషేక్ మీనా కళాశాల సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్‌కు గురయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విచారణ ప్రారంభం


ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ర్యాగింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టారు. ఈ విచారకర సంఘటనకు పాల్పడిన విద్యార్థులను గుర్తించే దిశలో విచారణ చేపట్టారు. క్యాంపస్‌లో ర్యాగింగ్ నివారణపై చైతన్యం, అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వర్గం పని చేస్తుంది. ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ ప్రత్యక్షంగా ఈ వ్యవహారం పర్యవేక్షిస్తుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మాయ పాఢి తెలిపారు.

ర్యాగింగ్ ఇలా...

ఈనెల 17న మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ సంఘటన చోటు చేసుకుంది. మొదటి సంవత్సరం చదువుతున్న అభిషేక్ మీనాపై రెండో సంవత్సరం చదువుతున్న కొందరు విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. సీనియర్లు బలవంతంగా అభిషేక్ గడ్డం, మీసాలు తీసేసి అతనితో అసభ్యంగా ప్రవర్తించి ర్యాగింగ్‌కు పాల్పడినట్లు సమాచారం. దీంతో అభిషేక్ కళాశాల అధికారులకు ఫిర్యాదు చేయగా, ర్యాగింగ్ నిరోధక కమిటీతో చర్చించిన అనంతరం డీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ర్యాగింగ్ ఆరోపణ తలెత్తితే సత్వర చర్యలు చేపట్టడం అనివార్యం. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ మార్గదర్శకాల మేరకు చర్యలు చేపట్టి తక్షణమే తెలియజేయాల్సి ఉంటుందని డీన్ వివరించారు. యూజీసీ మార్గదర్శకాల మేరకు ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతుంది. స్థానిక ఎస్పీ క్యాంపస్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పూరీ ఎస్‌డీపీవో తెలిపారు. ఇదిలా ఉండగా ముగ్గురు నిందిత విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌కు క్షమాపణ లేఖను సమర్పించినట్లు తెలిసింది.

జగన్నాథుడి దర్శనానికి సంప్రదాయ వస్త్రధారణ

- 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌కు ప్రతిపాదన



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో జగన్నాథుని దర్శించేందుకు సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన బలపడుతోంది. దీర్ఘకాలంగా ఈ ప్రతిపాదన వెలుగులోకి వచ్చినా ప్రభుత్వ స్పందన కొరవడుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్ పూరీ పర్యటన పురస్కరించుకుని ఆలయం ఖుంటియా నియోగి సేవకుల వర్గం ఈ విషయమై ముఖాముఖి సంప్రదించింది. స్వామి దర్శనానికి సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరి చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఈ వర్గం అభ్యర్థించింది. ఈ విషయమై పాండియన్‌కు మెమోరాండం సమర్పించినట్లు తెలిపారు. పూరీలోని శ్రీజగన్నాథ ఆలయాన్ని సందర్శించే భక్తులకు సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించినట్లు ఖుంటియా నియోగి సంఘం అధ్యక్షుడు హజూరి కృష్ణ చంద్ర ఖుంటియా తెలిపారు.

ఆలయ పవిత్రత పరిరక్షణ

ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ వస్త్రధారణ ఆరోగ్యవంతమైన పర్యావరణంతో ఆలయ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన వివరించారు. అసభ్య వస్త్రధారణతో భక్తులు, యాత్రికులు శ్రీ మందిరం ప్రాంగణంలోనికి ప్రవేశించిన దాఖలాలు తరచు తారసపడుతున్నాయి. ఈ విచారకర పరిస్థితుల నివారణకు సంప్రదాయ వస్త్ర నియమావళి తక్షణమే జారీ కావాలని తెలిపారు.

చనుబాల కేంద్రం

అలాగే పసిబిడ్డలకు చనుబాలు అందించేందుకు వీలుగా ఆలయ పరిసరాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్వామి దర్శనానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు, యాత్రికులకు సముచిత సౌకర్యాలు కల్పించడం ఆలయ పాలక వర్గం ప్రథమ కర్తవ్యంగా పరిగణించాలన్నారు. సంప్రదాయం, సామాజిక సంక్షేమం పరిరక్షణ దిశలో సంస్కరణలు శరవేగంగా చేపట్టాలన్నారు.

మొబైల్ నిషేధం

శ్రీమందిరంలో మొబైల్ ఫోను వినియోగం కట్టుదిట్టం చేయాలని ఈ వర్గం 5టీ కార్యదర్శికి ప్రత్యేకంగా అభ్యర్థించింది. ఆలయంలో మొబైల్ ఫోను వినియోగం నిషేధం ఉత్తర్వుల అమలు, కార్యాచరణ తేలికపాటిగా కొనసాగుతుందని ఆరోపించారు. ఆలయ పాలకవర్గం, పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టి ఆలయంలో మొబైల్ ఫోన్ వినియోగంపై నిషేధం కార్యాచరణ కఠినంగా అమలు చేయాలని కోరారు.

తీవ్ర విషాదం

- స్తంభానికి ఢీకొన్న భోల్‌భం భక్తుల కారు
- ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో నలుగురి పరిస్థితి ఆందోళనకరం



ప్రమాదానికి గురైన కారు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మృత్యువాత పడిన భక్తులు

బరంపురం: మహా శివుడికి ఇష్టమైన శ్రావణ సోమవారం సందర్భంగా గంజా జిల్లా అస్కా నుంచి బెజ్జిపుట్ గ్రామంలోని శివాలయానికి కారులో బయల్దేరిన బోల్‌భం భక్తుల దీక్షలో అపశృతి చోటుచేసుకుంది. శివాలయానికి వెళ్తున్న 10 మంది బోల్‌భం దీక్షలు చేపట్టిన మహిళల కారు విద్యుత్ స్తంభానికి ఢీకొంది. దీంతో పొలాల్లోకి కారు పల్టీలు కొట్టింది.

ఈ దుర్ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కలెక్టర్ దివ్య జ్యోతి ఫరిడా మరియు గంజాం ఎస్పీ జగమోహన్ మీనా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వీరి ఆదేశాలతో అగ్నిమాపక సిబ్బంది మరియు ఓడ్రాఫ్ బృందం పల్టీలు కొట్టిన కారులో చిక్కుకున్న మృతదేహాలు, క్షతగాత్రులను వెలికి తీశారు. వారిని బంజనగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తరలించి క్షతగాత్రులకు చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 8 మంది క్షతగాత్రులను బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు అంబులన్స్‌ల్లో తరలించారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి ఆందోళకరంగా ఉన్నట్లు ఎంకేసీజీ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ మిశ్రా తెలియజేశారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో దగ్ధమైన షాపు



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న షాపు

బరంపురం: స్థానిక పెద్ద బజార్‌లోని హోల్‌సెల్ షాపు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఐఐసీ అధికారి కులమణి సెఠి తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 9 గంటల సమయంలో పెద్ద బజార్‌లోని షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. వెంటనే సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. బరంపురం ఎస్పీ సర్వాన్ వివేక్ ఆదేశాలతో ఐఐసీ కులమణి సెఠి ప్రమాద స్థలానికి చేరుకొని శాంతి భద్రతలు పర్యవేక్షించారు. ప్రమాదంలో సుమారు రూ.60 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు యజమాని తెలియజేశారు.

ఆమె కళ్లు సజీవం



ధనలక్ష్మి మృతదేహం వద్ద వైద్యురాలు

బరంపురం: స్థానిక శక్తినగర్ 7వ లైన్‌కు చెందిన కె.ధనలక్ష్మి (71) సోమవారం మరణించింది. దీంతో ఆమె కళ్లను దానంచేసి కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. ధనలక్ష్మి చనిపోయిన విషయం తెలుసుకున్న స్థానిక ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, ఎంకేసీజీ మెడికల్ కంటి విభాగం వైద్యుల సహకారంతో నేత్రాలను తొలగించి మరో ఇద్దరికి అమర్చారు. మృతిరాలి భౌతిక కాయానికి స్నేహితులు, బంధువులు నివాళులర్పించారు.

మెట్లపై జారిపడి వ్యక్తి దుర్మరణం



త్రినాథ్ ప్రసాద్ ఖడంగా మృతదేహం

జయపురం: ఇంటి మెట్లపై జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన జయపురం మెయిన్ రోడ్డులోని రాజనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రాజనగర్‌కు చెందిన త్రినాథ్ ప్రసాద్ ఖడంగా కాలుజారి పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన చంద్రశేఖర్

పార్వతీపురం: వర్తన మార్చుకోకపోతే చనిపోతానని చెప్పిన భర్త యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈసంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పదోవార్డుకు చెందిన పి.చంద్రశేఖర్(30)కు భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. నీ ప్రవర్తన సక్రమంగా లేకపోతే చనిపోతానని భార్యతో చంద్రశేఖర్ చెప్పినప్పటికీ ఆమె పెడచెవిన పెట్టడంతో పాటు చచ్చిపో అని అనడంతో మనస్తాపం చెంది యాసిడ్ తాగాడు. ఈ మేరకు చికిత్సకోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యం చేస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలి

విజయనగరం అర్బన్: బొబ్బిలి దగ్గరున్న ఎన్‌సీఎస్ సుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెరిపించాలి. అలాగే భీమసింగి చెరకు ఫ్యాక్టరీని మళ్లీ ప్రారంభించాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం, జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బి.రాంబాబు డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంక్షేమ సంఘం, జిల్లా రైతు సంఘాల సంయుక్త నిర్వహణలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఈ మేరకు పేర్కొన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిచి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మినాయుడు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు దేవుడు బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీలో రాష్ట్ర ప్రాతినిథ్యం శూన్యం

● రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి

భువనేశ్వర్: కాంగ్రెస్ కార్యనిర్వాహక కమిటీ (సీడబ్ల్యూసీ) పునర్‌వ్యవస్థీకరణ రాష్ట్ర నేతల్లో తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. అత్యున్నత నిర్ణాయక సంఘంలో రాష్ట్రం నుంచి ఎవరికీ చోటు కల్పించకపోవడం విచారకరం. సీడబ్ల్యూసీలో ఒడిశాకు చెందిన పార్టీ నేతలకు స్థానం కల్పించకపోవడంపై రాష్ట్ర కాంగ్రెస్ శిబిరంలో అసంతృప్తి సెగలు వేడెక్కుతున్నాయి. ఆదివారం కాంగ్రెసు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో రూపొందిన కొత్త కార్యనిర్వాహక కమిటీలో రాష్ట్ర నాకులకు స్థానం కల్పించలేదు. దీంతో సోమవారం స్థానిక కాంగ్రెస్ శిబిరంలో అసంతృప్తివాదుల బలం పుంజుకుంటుంది. పలువురు సీనియర్ నాయకులు జాతీయ స్థాయి కమిటీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై పెదవి విరిచారు.

నామమాత్రపు చర్యలు

39 మంది సీడబ్ల్యూసీ సభ్యుల జాబితాలో ఒడిశాకు చెందిన ఏ కాంగ్రెస్ నాయకుడి పేరూ లేకపోగా, కేంద్ర మాజీ మంత్రి భక్త చరణ్ దాస్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. పార్టీ అధ్యక్షుడు నియమించిన ఐదుగురు ఇన్‌చార్జిల్లో ఆయన ఒకరు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిశా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో దాస్‌ను టీమ్‌లో చేర్చుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ పునరుద్ధరణకు నానా తంటాలు పడుతున్న విషయం తెలిసిందే. పార్టీ పనితీరులో ఆయన కీలక పాత్ర పోషిస్తారని కాంగ్రెస్ సీనియర్ నేతలు అసంతృప్తివాదులకు బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

తీరని అన్యాయం

గత కొన్నేళ్లుగా సీడబ్ల్యూసీలో రాష్ట్రానికి చెందిన ఎవరినీ చేర్చకుండా అఖిల భారత కాంగ్రెసు కమిటీ ఏఐసీసీ ఒడిశాకు తీవ్ర అన్యాయం చేస్తుందని సీనియర్ నాయకుడు, జట్నీ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ తీవ్ర ఆవేశం వ్యక్తం చేశారు. ఏఐసీసీ రాష్ట్రం మరియు రాష్ట్ర నాయకులపై తగిన శ్రద్ధ చూపకుండా ఒడిశాను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేల దృష్టికి తీసుకెళ్లి ఒడిశాకు న్యాయం చేయాలని కోరతానని ఫైర్ బ్రాండ్ కాంగ్రెస్ నేత రౌత్రాయ్ అన్నారు. ఒడిశా నాయకుల సేవలు ఏఐసీసీకి అవసరం లేనట్లు స్పష్టం అవుతోందని సీనియర్ నాయకుడు మరియు రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి చెందిన మరికొంత మంది నాయకులకు సీడబ్ల్యూసీలో చోటు కల్పించి ఉంటే తాము సంతోషంగా ఉండేవాళ్లమని ఒడిశా ప్ర దేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ అన్నారు. న్యూఢిల్లీ వెళ్లి ఒడిశాకు చెందిన ఇద్దరు, ముగ్గురు నేతలను పార్టీ ఉన్నత స్థాయి నిర్ణాయక కమిటీలో చోటు కల్పించాలని ఖర్గేను అభ్యర్థి స్తానని రాష్ట్ర కాంగ్రెసు చీఫ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం



మృతి చెందిన శివ ముదులి, విశ్వనాథ్ ముదులి



ప్రమాద స్థలంలో కారు, బైక్

జయపురం: జయపురం– బొరిగుమ్మ 26వ జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదం నింపింది. జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో అన్నదమ్ములు విశ్వనాథ్ ముదులి, శివ ముదులిలు ఒక ద్విచక్ర వాహనంపై బొరిగుమ్మ నుంచి జయపురం వస్తున్నారు. అదే సమయంలో ఒక కారు జయపురం నుంచి బొరిగుమ్మ వైపు వెళ్తుండగా, 26వ జాతీయ రహదారి రొండాపల్లి సమీపంలో ఎదురెదుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విశ్వనాథ్, శివలు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. ప్రమాద సమాచారం అందిన వెంటనే గగణాపూర్ పోలీసుస్టేషన్ సంటి పోలీసు అధికారి గౌరవ రంజన్ దాస్, ఏఎస్‌ఐ ప్రియదర్శి గొమాంగో కామాక్ష ప్రసాద్ బిశాయిలు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ వైద్యం కోసం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ప్రమాద విషయం తెలిసిన బంధువులు బోరున విలపిస్తూ ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

రూ.8 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా పోలీసుస్టేషన్‌కు సమీపంలో లుహాగుడి జంక్షన్ పరిధి మొకురా అంబో గ్రామ జంక్షన్ వద్ద అడవ నుంచి మోహనా మీదుగా పశ్చిమ బెంగాల్ వెళ్తున్న ట్రక్కును పెట్రోలింగ్ సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన ట్రక్కులో తనిఖీలు చేపట్టగా 135 బస్తాల్లో గంజాయి పట్టుబడింది. 135 బస్తాల్లో మొత్తం 43.50 క్వింటాళ్ల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. దీనివిలువ సుమారు రూ.8 కోట్లు ఉంటుందని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తెలియజేశారు. గంజాయి రవాణా చేస్తున్న ట్రక్కుకు ముందు భాగంలో ఒడిశా నంబర్ ప్లేటు, వెనుక భాగంలో పశ్చిమ బెంగాల్ నంబర్ ప్లేటు ఉన్నట్లు మోహనా పోలీసుస్టేషన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

ఐఐసీ అధికారి బసంత్ కుమార్ శెఠి తెలియజేశారు. వాహనాన్ని వదిలి ట్రక్కు డ్రైవరు, హెల్పర్ పారిపోయినట్టు పేర్కొన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పర్లాకిమిడి: పర్లాకిమిడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాణిపేట గ్రామం వద్ద ఒక వ్యక్తి గాయాలతో పడి ఉండడంతో స్థానికులు చూసి 108 అంబులెన్స్ ద్వారా పర్లాకిమిడి కేంద్ర ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రంగా గాయలైన ఆయనను గుమ్మా సమితికి చెందిన శిశిర్ గోమాంగో (35)గా గుర్తించారు. సోమవారం ఉదయం ఏదో గుర్తు తెలి యని వాహనం ఢీకొనడంతో గాయాలైనట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయుడిపై దాడి

● ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రాయగడ: ఉపాధ్యాయుడిపై దాడి కేసుకు సంబంధించి ఇద్దరి నిందితులను కాసీపూర్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసు లు తెలిపిన వివరాల మేరకు.. రాసీజిరి గ్రా మంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి గా ముంకా కేసరి బెహరా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం గ్రామంలో ఓట రు నమోదు ప్రక్రియలో భాగంగా ఇంటింటా తిరిగి పేర్లను నమోదు చేస్తున్నాడు. ఈ క్రమంలో రవీంద్ర నాయక్, కిరన్ చంద్ర నాయక్‌లు, ఉపాధ్యాయుడు బెహరాకు ఒక సర్టిఫికెట్‌కు సంబంధించి వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు బెహరాపై దాడికి దిగారు. ఈ విషయమై శనివారం రాత్రి కాసీపూర్ పోలీసుస్టేషన్‌లో బెహర ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఘరానా దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సబ్ డివిజనల్ డీఎస్పీ ఆర్.గోవిందరావు (ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణ పరిధిలో 12 ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ఘరానా దొంగను పోలీసులు అరెస్ట్ చేసి, 27 తులాల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు వివరాలు వెల్లడించారు. మెంటాడ మండలం కొప్పంగి గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు గతంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పదేళ్లపాటు పనిచేసి, ఉద్యోగం మానేసి, చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఏడాది కాలంగా విజయనగరం పట్టణంలోని ఉడాకాలనీ, బాబామెట్ట ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితుల ఫిర్యాదుమేరకు ఎస్పీ ఆదేశాలతో నిందితుడ్ని పట్టుకునేందుకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సాలిపేట జంక్షన్ గురజాడ పబ్లిక్ స్కూల్ రోడ్డులో నిందితుడు శ్రీనివాసరావు పట్టుబడ్డాడని డీఎస్పీ తెలిపారు. విచారణలో నిందితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉడాకాలనీ ఫేజ్-1, 2, ,3, అలకానందకాలనీలో ఏడు నేరాలు, విజయనగరం టూటౌన్ పరిధిలో రింగురోడ్డు, బాబామెట్ట ప్రాంతాల్లో ఐదు నేరాలకు పాల్పడినట్లు చెప్పాడని తెలిపారు. గతేడాది కాలం నుంచి నిందితుడు పట్టణంలో 12 నేరాలకు పాల్పడగా, నిందితుడి నుంచి రూ.25 లక్షలు విలువ చేసే 27 తులాల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి వస్తువులను, దొంగతనం చేసేందుకు వినియోగించే పనిముట్లను కూడా రికవరీ చేసి, నిందితుడ్ని రిమాండ్‌కు పంపించామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో క్రియాశీలకంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సై వి.అశోక్ కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబల్స్ టి.శ్రీను, బి.శివ, బి.శంకరరావు, ఎన్.గౌరీశంకర్‌లను ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

కారు బోల్తా: నలుగురికి గాయాలు



బోల్తా పడిన కారు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రహదారిలో చిదిమి జంక్షన్ వద్ద సోమవారం ఓ కారు బోల్తా పడింది. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించిన వారంతా పెనుప్రమాదం జరిగి ఉంటుందని ఊహించారు. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వీరఘట్టం మండలం వెంకమ్మపేట నుంచి పట్టణంలోకి వస్తున్న కారు ప్రమాదానికి గురైంది.

లారీ ఢీ కొని వ్యక్తికి..

రామభద్రపురం: మండలకేంద్రంలో సోమవారం వేకువజామున లారీ ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని చొక్కాపు వీధికి చెందిన గంట అప్పలనాయుడు వేకువజామున 4.30 గంటల సమయంలో టీ తాగేందుకు జంక్షన్‌కు వెళ్తున్నాడు. ఇంతలో విశాఖపట్నం నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వస్తూ టీబీఆర్ థియేటర్ సమీపంలో అప్పలనాయుడిని బలంగా ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బల మీదకు ఈడ్చుకెళ్లింది. దీంతో లారీ, మట్టివదిబ్బల మధ్యలో ఉండిపోయిన బాధితుడిని బయటకు తీయడానికి సుమారు రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. బయటకు తీసిన తరువాత ప్రథమ చికిత్స బాడంగి సీహెచ్‌సీలో చేయించి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

విజయనగరం క్రైమ్: గుర్ల మండలానికి చెందిన వెంపడాపు వెంకటలక్ష్మి (20) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం గరివిడి మండలానికి చెందిన చిన్నతో వెంకటలక్ష్మికి పెళ్లయింది. వృత్తిరీత్యా విజయవాడలో రియల్ ఎస్టేట్ పనులకు భర్త వెళ్లిపోయాడు. దీంతో అలకానందకాలనీలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న తల్లిదండ్రుల వద్దనే వెంకటలక్ష్మి ఉంటోంది. అపార్ట్‌మెంట్‌లో పైగది ఖాళీగా ఉండడంతో అక్కడ కుట్టుపనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. యథావిధిగా సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి పైకి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రావాల్సిన మనిషి రాకపోవడంతో తల్లి పైకి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో కిందికి దించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి వచ్చి పరిశీ లించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల బీభత్సం

- 21 తులాల బంగారు ఆభరణాల చోరీ
- కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అడ్వకేట్ ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు




వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పార్వతీపురంటౌన్: పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఇళ్లల్లో 21 తులాల బంగారు, రెండు కేజీల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సౌందర్య థియేటర్ వెనుక ఉన్న సౌందర్యనగర్ కాలనీలో అడ్వకేట్ నీలం రాజేశ్వరరావు ఈనెల 17వ తేదీన కుటుంబసమేతంగా తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం చేసుకుని 21న పార్వతీపురంలోని ఇంటికి చేరుకుని పగులగొట్టి ఉన్న తలుపులను చూసి కంగుతిన్నారు. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలు, అలమరాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన ఓ వ్యక్తి ఇంటిలో తులం బంగారం, పది తులాల వెండి వస్తువులు చోరీ గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై క్లూస్‌టీం సంఘటనా స్థలాలకు వచ్చి ఆధారాలు సేకరించింది. పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

సీతామాంబపురంలో..

కొమరాడ: మండలంలోని గుమడ పంచాయతీ సీతామాంబపురం గ్రామంలో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మోటార్ సైకిల్స్‌పై ఇద్దరు మగవారు ఇద్దరు ఆడవారు చిన్న బాబును తీసుకుని వచ్చి గ్రామంలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మడక జోగి నాయుడు ఇంట్లో ఎవరూ లేనట్లు పసిగట్టి చెట్టుకింద ఒక మహిళ కాయలు కోస్తున్నట్లు నటించింది. మరో మహిళ జోగినాయుడు ఇంట్లో దూరి వారి వద్ద ఉన్న తాళాలతో ఇల్లు, బీరువా ఓపెన్ చేసి రూ. 50 వేలు, ఐదు గ్రాముల బంగారం చోరీ చేసింది. ఆ ఇంటి దగ్గరలో ఉన్నవారు కేకలు వేసేసరికి తాము కుంకుమ అమ్మడానికి వచ్చామని చెప్పి పారిపోయారు. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు బడుల్లో డిజిటల్ బోధన



డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు



ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీలు, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల సాయంతో కూడిన బోధన వల్ల పాఠశాల విద్యలో మంచి ఫలితాలను సాధించవచ్చు. విద్యార్థులకు ఎంతటి కఠిన పాఠ్యాంశాలైనా సులభంగా అర్థమవుతాయి. అవగాహన కలుగుతుంది. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచుతాయి. ఈ విధానంతో భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు వస్తాయి. శ్రద్ధగా పాఠాలు వినడంతోపాటు కొత్త అంశాలను నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతారు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ.

- బిగ్ స్క్రీన్‌లపై అర్థవంతమైన బోధన
- తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు
- ఈ ఏడాది ప్యానెల్స్ ఏర్పాటుకు 768 ప్రభుత్వ స్కూళ్ల ఎంపిక
- 1,14,431 మంది విద్యార్థులకు ప్రయోజనం
- జిల్లాకు 2,635 ఐఎఫ్‌పీలు, 755 స్మార్ట్ టీవీల కేటాయింపు
- తొలిదతగా ఐఎఫ్‌పీలు 1,327, స్మార్ట్ టీవీలు 355 రాక
- వీటి వినియోగంపై ఇప్పటికే 6,611 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

విజయనగరం అర్బన్: ప్రభుత్వ బడులు రోజురోజుకూ బలోపేతమవుతున్నాయి. నాడు కనీసం మరుగుదొడ్లకు నోచుకోని పాఠశాలలు నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నాయి. పేదకుటుంబాల పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయి.

నాడు–నేడు అనేలా...

మనబడి నాడు-నేడు కింద విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, విజ్ఞానం పంచే బొమ్మలతో కూడిన తరగతి గదులు, గ్రీన్‌చాక్‌బోర్డులు, తాగునీటి ప్లాంట్లు, పలకలతో కూడిన గచ్చులు.. పచ్చని చెట్లతో సరస్వతీనిలయాలను ప్రభుత్వం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుత సాంకేతిక ప్రగతిని సర్కారు బడుల విద్యార్థులకు చేరువచేసేలా డిజిటల్ తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పాఠ్యాంశబోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్త బోధనను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో 1,14,431 మందికి ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో బోధన

విజయనగరం జిల్లాలో 768 ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2,635 ఐఎఫ్‌పీ, 755 స్మార్ట్ టీవీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటివల్ల 1,14,431 మంది విద్యార్థులకు డిజిటల్ బోధన చేరువకానుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 1,327 ఐఎఫ్‌పీలు, 355 స్మార్ట్ టీవీలను కేటాయించింది. ప్రస్తుతం వీటిని ఆయా స్కూళ్లలో ఏర్పాటుచేయడంతో డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. రెండో విడతలో మరో 1,308 ఐఎఫ్‌పీలు, 400 స్మార్ట్ టీవీలు విడుదల చేయాలని నిర్దేశించింది. వీటి ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునేందుకు డిజిటల్ తరగతులు దోహదపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీలు, మూడు నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీల ద్వారా బోధన సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. స్మార్ట్ టీవీలకు ఇంటర్‌నెట్ అనుసంధానం చేసి, ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్టుచేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. వీటిని చూస్తున్న విద్యార్థులు పలు అంశాలను సులభంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులు అవసరమనుకున్న అంశాలను ఫైల్ రూపంలో సేవ్ చేసుకుని అవసరం ఉన్నప్పుడు తిరిగివినే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీపడి ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.



ఐఎఫ్‌పీలపై శిక్షణలో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం 6,611 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 1,204 మందికి, గరివిడి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 1,178 మందికి, జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలో 275, లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో 1,995 మందికి, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 1,261 మందికి, సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 698 మందికి ఒక్కొక్కరికీ రెండు రోజుల చొప్పున 14 రోజుల పాటు శిక్షణ తరగతులను ఉన్నత విద్యామండలికి చెందిన సబ్జెక్టు నిపుణులతో నిర్వహించారు.

ఐఎఫ్‌పీతో ఉపయోగాలు ఇవే..

- ఐఎఫ్‌పీతో దృశ్య శ్రవణ, ఇంటరాక్టివ్‌తో కూడిన 2డీ, 3డీ యానిమేటర్ కంటెంట్ బోధన అందుతుంది.
- విద్యార్థికి సులభంగా అవగాహన, కఠినమైన భావనలను సరళీకృతం చేసి బోధించేందుకు ఉపయోగపడుతుంది. ఉదాహరణకు గుండె గురించి విద్యార్థులకు బోధించే సమయంలో నేరుగా గుండె పనిచేసే విధానం, వీడియో, ఆడియో రూపంలో చూపించడం వల్ల విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది.
- ప్రపంచ స్థాయిలో పోటీపడే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి సహాయపడుతుంది.
- జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నాణ్యమైన విద్యను అందించేందుకు బైజూస్‌తోపాటు ఎన్‌సీఈఆర్‌టీ వారు పాఠ్యాంశ ప్రణాళిక రూపొందిస్తున్నారు.



ఐఎఫ్‌పీ వినియోగంపై విద్యార్థులకు నేర్పుతున్న టీచర్

క్లుప్తంగా

'కార్పొరేషన్ పదవి జిల్లాకు కేటాయించాలి'



మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసిన శిష్టకరణ సంఘ నేతలు

శ్రీకాకుళం రూరల్: శిష్టకరణాల కార్పొరేషన్ పదవి జిల్లాకు కేటాయించాలని కోరుతూ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు సంఘ నేతలతో కలిసి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సోమవారం విన్నవించారు. పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు ధర్మానను కలిశారు.

26న మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, విభిన్న ప్రతిభావంతుల శాఖలు సంయుక్తంగా యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 26న శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నాయి. ఈ పోస్టర్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో సుమారు 16 స్థానిక, బహుళ జాతి ప్రైవేటు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి ఉండి, 18–35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉన్న యువత ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6301045132, 6301275511 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అంశంపై సదస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం సదస్సు నిర్వహించనున్నారు. వైఎస్సార్ మేధావుల ఫోరం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.బాలమోహన్ దాస్, వైఎస్సార్ మేధావులు ఫోరం వ్యవస్థాపక కార్యదర్శి జి.శాంతమూర్తి, ఇన్నోవేషన్ సొసైటీ ఆఫ్ ఏపీ జాయింట్ డైరెక్టర్ లావణ్య పాల్గొననున్నారు.


పాముకాటుతో వ్యక్తి మృతి



వండాన భాస్కరరావు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామానికి చెందిన వండాన భాస్కరరావు(33) పాముకాటుతో మృతి చెందాడు. ఆయన ఆదివారం సాయంత్రమే పొలంలో పాముకాటుకు గురై మృతి చెందాడు. అయితే సోమవారం ఉదయం వరకు ఎవరూ గుర్తించలేదు. పొలానికి వెళ్లిన భాస్కరరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులంతా ఆందోళన చెందారు. సోమవారం పొలం పనులకు వెళ్లిన రైతులు అక్కడ పడి ఉన్న భాస్కరరావును గుర్తించారు. కాళ్లపై పాము కోరల గుర్తులు ఉండడంతో పాముకాటు వేసిందని నిర్ధారించుకున్నారు. మృతునికి భార్య పావని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్‌ఐ లక్ష్మణరావు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు ఆనందరావు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి లచ్చన్నపేట గ్రామానికి చెందిన బోకర ఆనందరావు(40) సోమవారం చెరువులో పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆనందరావు తన భార్య మాధవితో కలసి గ్రామ సమీపంలోని మదనగోపాలసాగరానికి స్నానానికి వెళ్లారు. బహిర్భూమికి వెళ్తానని చెప్పి ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయారు. గుర్తించిన స్థానికులు ఆయనను బయటకు తీసి హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసేవారు. అక్కడ నుంచి ఇచ్ఛాపురం బదిలీపై వెళ్లిపోయారు. ఆరోగ్యం బాగోలేదని సెలవు పెట్టి ఇంటివద్దనే ఉంటున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు మనిదీప్, మోక్షశ్రీ లు ఉన్నారు. ఆనందరావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జానపదం.. జ్ఞాన పథం



జానపద గేయ రచయిత, గాయకుడు గేదెల తులసయ్య

ఉవ్వెత్తున ఉద్యమం ఎగసిన చోట ఓ పాట పురుడు పోసుకుంటుంది. కలం లేకుండా జన్మనెత్తిన ఈ పాట కలకాలం నిలిచి ఉంటుంది. ఉత్సాహంగా ఉభాలు జరిగే వేళ మరో పాట విరబూస్తుంది. కాగితాల అవసరం లేకుండా కూలి జనం గొంతులో తరాల తరబడి జీవిస్తూ ఉంటుంది. అమ్మకు ఘటమెత్తే పరవశంలో ఓ రాగం ఉద్భవిస్తుంది. తల్లి ఆశీర్వాదంతో ఆ గానం అజరామరమై విరాజిల్లుతుంది. గుండెకు దగ్గరగా తప్పెటగుళ్లు ఝుల్లుమంటుంటే గొంతులో ఓ పదం శృతి కలుపుతుంది. అప్పటి నుంచి ఆ పాట పల్లె గుండె చప్పుడైపోతుంది. అదీ జానపదమంటే. రాసిందెవరో, రాగం కట్టిందెవరో తెలియక పోయినా ఆ జానపదాలు జ్ఞానపథాలై మన చరిత్రను ముందు తరాలకు అందిస్తాయి.

నేడు ప్రపంచ జానపదుల దినోత్సవం.

– శ్రీకాకుళం కల్చరల్, పలాస, ఇచ్ఛాపురం రూరల్



జానపద కళారూపాలు

- నేడు ప్రపంచ జానపదుల దినోత్సవం
- జిల్లాలో ఐదువేల మంది జానపద కళాకారులు
- అమ్మవారి సంబరాల్లో వీరిదే కీలక పాత్ర
- నేడు వజ్రపుకొత్తూరులో జానపద దినోత్సవాలు

గ్రామీణ జీవనానికి అసలు సిసలు నిదర్శనం జానపదం. జాతరలు, తిరునాళ్లు, నవరాత్రుళ్లలో ఈ జానపదాలు మన చరిత్రను మళ్లీ మనకు గుర్తు చేస్తూ ఉంటాయి. జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో కళారూపం ప్రచారంలో ఉంటూ ఆ ప్రాంత సంప్రదాయానికి కాపు కాస్తూ ఉంటుంది. జిల్లాలో అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన జానపద కళాకారులు ఉన్నారు. తప్పెటగుళ్లు, డప్పువాయిద్యం, రుంజావాయిద్యం, చెక్కభజన, పండరి భజన, కోలాటం, పందిరిపాట, ఎరుకల పాట, జముకుల పాట, తూర్పుభాగవతం, శివ భాగవతం, రామదాసు కీర్తనలు, దాసరి పాటలు, ఇసకుని పక్షి, ఎరుక చెప్పుట, తోలు బొమ్మలాట, గిరిజన నృత్యం, చెంచు భాగవతం, కోయి నృత్యం, పులివేషం, పగటి వేషధారణ, బుర్రకథ, ఉడుపు పాటలు, పల్లెసుద్దులు, సోది చెప్పుట, దాసర్లు, గంగిరెద్దుల వారు అందరూ జానపద కళలకు ప్రతినిధులే.

సిక్కోలు సాయుధ పోరాటం నుంచి

శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో జానపదాలు ప్రధాన భూమిక పోషించాయి. భూస్వాములు, దోపిడీదారుల నిరంకుశ విధానాలను ఎండగడుతూ 1969 నుంచి ప్రముఖ జానపద కళాకారుడు సుబ్బారావు పాణిగ్రాహి తన జముకుల పాటతో ప్రజల్లో చైతన్యం కలిగించారు. అలాగే కళాకారుడు, హరికథ భాగవతార్ ధర్మపురి కృష్ణమూర్తి హరికథ ద్వారా, వెంపట సత్యం జముకుల కథలతో, వీరితో పాటు ప్రజా నాట్య మండలి, జన నాట్య మండలి ద్వారా జానపద బాణీలతో ప్రజల్లో జానపద పాటలకు కళారూపాల ద్వారా జీవం పోశారు. ప్రస్తుతం జిల్లాలో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సంఘం, గిడుగు రామూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, ఉద్దానం సాహిత్య సంస్కృతి, సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక వంటి సంస్థలు తమ ఆధ్వర్యంలో పల్లె, పట్టణ ప్రాంతాల్లో జానపద కళలను, కళాకారులను ప్రోత్సాహిస్తున్నాయి.



జానపద కళాకారుడు,సినీ గాయకుడు బాడ సూరన్న గంగిరెద్దుల ప్రదర్శన

● పాటల ఊట

సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక సంస్థకు ప్రచార కార్యదర్శిగా పనిచేస్తున్న కుత్తమ వినోద్ మాజీ సైనిక ఉద్యోగి. ఉద్దానం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఈయన 'గర్జన' పేరుతో ఇప్పటి వరకు ప్రజా రచయితగా 250 వరకు జానపద, సామాజిక గేయాలు రచించగా, 200కు పైగా జానపద పాటలకు స్వయంగా బాణీలు కూర్చారు. ఈయన భార్య రోజారాణి కూడా గాయని కావడంతో ఆమెతో కలసి పాతిక వరకు జానపద గేయాలను పాడారు. అలాగే గర్జన గళం, స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు, నిప్పు కణికలు వంటి పుస్తకాలను రచించారు.



వినోద్ రచించిన జానపద గేయాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న(ఫైల్)

● జానపద సంరక్షకుడు

బద్రి కూర్మారావు వృత్తిరీత్యా ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులైనా, జానపద కళలకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఉద్దానం రంగోయి గ్రామానికి చెందిన ఈయన గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠానికి వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర జానపద కళలు, కళింగాంధ్ర జానపద గేయాలు, ఉత్తరాంధ్ర వెతలు–ఉద్దానం కథలు, ఉత్తరాంధ్ర జానపద సామెతలు వంటి పలు పుస్తకాలను రచించారు.

నేడు వజ్రపుకొత్తూరులో జానపద దినోత్సవాలు

వజ్రపుకొత్తూరులో మంగళవారం సాయంత్రం 6 గంటలకు జానపద దినోత్సవాలు జరుగునున్నాయని ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డపాడు చిన్నారుల జానపద నృత్యాలు, బెండి గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఉంటాయని ఆయన పేర్కొన్నారు.



తప్పెటగుళ్లు కళాకారులతో బద్రి కూర్మారావు

● పల్లె పాటకు కేరాఫ్..

ఉద్దానం రంగోయికి చెందిన గేదెల తులసయ్య డప్పు కొట్టి పాట పాడితే చాలు జనాలు పరవశించి పోవాల్సిందే. జానపద గేయాలకు పెద్దపీట వేస్తున్న తులసయ్య ఇప్పటి వరకు వివిధ వేదికలపై సుమారు 160కి పైగా జానపద గేయాలతో పాటు సామాజిక పాటలు పాడి రికార్డింగ్ చేశారు. వృత్తిరీత్యా ఇతర రాష్ట్రంలో ఉన్న తులసయ్య 7వ తరగతి నుంచే జానపద పాటలు పాడి అలరించేవాడు. ఇప్పటి వరకు సుమారు 100కు పైగా పల్లె పాటలు రచించారు. ఏటా సంక్రాంతి, ఉగాది, దసరాలకు స్వగ్రామానికి వచ్చి పల్లె పాటలు పాడటంతో పాటు పనిచేసే చోట పాటలు రాస్తూ, పాటకు బాణీలు కడుతూ వీడియో రూపంలో ప్రసార మాధ్యమాల్లో విడుదల చేస్తుంటారు.

అవకాశాలు కల్పించాలి

జిల్లాలో 5వేల మంది కళాకారులు ఉన్నారు. వారికి ప్రదర్శనల కోసం అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా దేవాలయాల పరిధిలో ఉత్సవాలు జరిగినప్పుడు తప్పనిసరిగా ఈ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేయాలి. అలాగే కళాప్రదర్శనకు అవసరమైన డ్రస్సులు, ఆభరణాలు కొనుగోలుకు రుణాలు ఇప్పించాలి. – కలగ గణేష్‌యాదవ్, జిల్లా జానపద కళాకారుల అధ్యక్షుడు

శుభకార్యానికి వచ్చి అనంతలోకాలకు..



వంశధార కాలువలో మునిగి మృతిచెందిన దుర్గారావు

కోటబొమ్మాళి: మండలంలోని కస్తూరిపాడు గ్రామంలో ఆదివారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి వచ్చిన నెయ్యల దుర్గారావు(15) వంశధార కాలువలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రౌర్కెలాకు చెందిన నెయ్యల రాజారావు కుటుంబం వారి దగ్గరి బంధువుల వివా హం కోసం ఆదివారం కస్తూరిపాడు వచ్చారు. చిన్న కుమారుడు దుర్గారావు, పెద్దకుమారుడు హరికృష్ణారావుతో కలిసి సాయంత్రం వంశధార కాలువకు స్నానం కోసం వెళ్లారు. అయితే దుర్గారావుకు ఈత రాకపోవడంతో ప్రవాహంలో మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు హరికృష్ణారావు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. గ్రామస్తులు కాలువలో గాలించగా రాత్రి మృతదేహం ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి



సవర వసంత (ఫైల్)

బూర్జ: మండలంలో గల పెద్దపేట, కొండపేట గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర వసంత (25) అనే యువకుడు మృతి చెందాడు. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అన్నంపేట గ్రామ సచివాలయం పరిధిలో గల జంగాలపాడు పంచాయతీకి చెందిన సవర వసంత (25) స్వగ్రామం నుంచి మన్యం జిల్లా పాలకొండకు మందులు కొనేందుకు బైక్‌పై బయల్దేరాడు. పెద్దపేట, కొండపేట గ్రామాల మధ్యకు వచ్చేసరికి ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న లారీ సడెన్‌గా స్లో చేయడంతో వసంత బండి లారీని ఢీకొట్టింది. వసంత తల, ముఖానికి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108 సాయంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సవర సరస్వతి, ఒక్క కుమారుడు ఉన్నాడు. వసంత వ్యవసాయ కూలీగా పనిచేస్తుండేవాడు. భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ బి.అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి

మెళియాపుట్టి: గిరిజనులు పండించే పంటలు వన్ ధన్ వికాస్ కేంద్రాల్లో విక్రయించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వెలుగు ఏపీఎం లలిత ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలోని వీడీవీకేలో జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. గిరిజనుల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు, వ్యవసాయ పట్టాలు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీఎం లలిత మాట్లాడుతూ.. వందన వికాస కేంద్రాల ద్వారా పలువురు గిరిజనులకు ఉపాధి లభిస్తుందని, మండలం మొత్తంగా 8 వీడీవీకేలు ఉన్నాయని, ఒక్కో వీడీవీకేలో 300 మంది పనిచేస్తారని వివరించారు.

‘ముందుగా గుర్తిస్తే మేలు’



మూడుపదులు నిండని యువకుడు కిడ్నీవ్యాధికి గురవడంతో పరీక్షిస్తున్న అమెరికా వైద్య బృందం

- పీడియాట్రిక్ నెఫ్రాలజిస్టు డాక్టర్ అనీషా
- ఉద్దానంలో కిడ్నీ వ్యాధులపై అధ్యయనం

కాశీబుగ్గ: జిల్లాతో పాటు ఉద్దాన ప్రాంతంలో అతి తక్కువ వయసులోనే కిడ్నీ సమస్యలకు గురవుతున్నారని, గుర్తించడంలో ఆలస్యం జరుగుతున్నందున జీవిత కాలం పెంచలేకపోతున్నామని పీడియాట్రిక్ నెఫ్రాలజిస్టు డాక్టర్ అనీషా అభిప్రాయపడ్డారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సోమవారం ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో నెఫ్రాలజిస్టుల బృందం ఉద్దాన ప్రాంతంతో పాటుగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించింది. తక్కువ వయసులో కిడ్నీ వ్యాధికి గురైన వారితో వారు మాట్లాడారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా నుంచి పీడియాట్రిక్ నెఫ్రాలజిస్టు డాక్టర్ అనీషా, బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ నివేదిత మాట్లాడారు. తక్కువ వయసులో కిడ్నీ సమస్య వచ్చినవారు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తీవ్రం అయ్యేంత వరకు వేచి చూడకూడదని చెప్పారు. ప్రభుత్వం ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ఉచిత సీకేడీ పరీక్షలు చేపడుతోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉద్దానంలో 20–30 ఏళ్ల వారు వ్యాధికి గురవుతున్నారని, నాలుగైదేళ్లలో పెరగాల్సిన స్టేజీలు ఏడాది నుంచి ఆరు మాసాల్లోనే పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సమయంలో గుర్తించి సరైన వైద్య సేవలు అందకపోతే కాపాడుకోలేమని అన్నారు. అనంతరం పలాస వైద్యం బృందం, సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్ వైద్యులు డాక్టర్ బాలాజీరావు, సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నూక కూర్మారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డబ్బీరు భవానీశంకర్, డాక్టర్ అరుణ్‌కుమారి, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వ్యాయామం చేయాల్సిందే'

పలాస: రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కిడ్నీ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేర్ సీకేడీయూ ప్రాజెక్టుకు చెందిన నెఫ్రాలజిస్టు డాక్టరు అనీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని, నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. బలవర్ధకమైన పోషకాహారం కూడా తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టరు నివేదిత, నెఫ్రాలజిస్టు డాక్టరు బాలాజీ, వైద్య సిబ్బంది ఎంపీ సత్యనారాయణ, స్వరూప, ఎ.ఎన్.ఎం రాణిప్రభ పాల్గొన్నారు.

ఎన్నేళ్లదో కల..

ఆస్పత్రులు భళా

- ప్రజా వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట
- సుమారు రూ.36 కోట్ల వ్యయంతో ఆస్పత్రుల అభివృద్ధి
- జిల్లాలో కొత్తగా 9 ఆస్పత్రుల నిర్మాణం
- ఉద్దానానికి ఊపిరిగా నూతన దవాఖానాల ఏర్పాటు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్

వజ్రపుకొత్తూరు రూరల్: దశాబ్దాలుగా అవే ఆస్పత్రులు.. అవే భవనాలు.. అవే సదుపాయాలతో కునారిల్లిపోతున్న ప్రజా వైద్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త జీవం పోసింది. ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించడంతో పాటు కొత్త ఆస్పత్రుల నిర్మాణం, పాత ఆస్పత్రుల ఆధునికీకరణ, అధునాతన పరికరాల ఏర్పాటు, నూతన వైద్యుల నియామకంతో జిల్లాలో ప్రజారోగ్య వైద్య వ్యవస్థ రూపురేఖలు మార్చింది. నాడు–నేడు కార్యక్రమం కింద బడులతోపాటు ఆస్పత్రులనూ బాగు చేసింది. అలాగే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.20 కోట్లు వెచ్చింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ఫేజ్–1లో ఏడు పీహెచ్‌సీలు ఏర్పాటు చేసింది. ఇందులో ఇచ్ఛాపురం మండలంలో గల ఈదుపురం, కవిటి మండలంలో గల మాణిక్యపురం, నందిగాం మండలంలో గల నౌగాం, బూర్జ, లావేరు, వజ్రపుకొత్తూరు మండలంలో గల అక్కుపల్లి, వెంకటాపురంలో ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫేజ్–2లో టెక్కలి మండలం లింగాలవలస, ఆమదాలవలస మండలంలో గల అచ్యుతాపురంలో ఆస్పత్రులు నిర్మించనున్నారు.

ఉద్దానంలో..

ఉద్దానం ప్రజలకు సేవలు అందిస్తున్న పలాస సీహెచ్‌సీని నాడు–నేడు కార్యక్రమం ద్వారా మరో రూ.5.30 కోట్లు నిధులతో ఆధునికీకరించారు. దీంతో పాటు వజ్రపుకొత్తూరు, గోవిందపురం, పలాస, రెంటికోట తదితర ప్రాంతాల్లోని పీహెచ్‌సీలను అధునాతనంగా తీర్చిదిద్దారు. ఉద్దానం ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టడానికి కాశీబుగ్గలో రూ. 50 కోట్ల వ్యయంతో 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ భవనం పనులు దాదాపు పూర్తయ్యాయి. అదనంగా మరో రూ.50 కోట్లతో అధునాతన పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది.

అప్పట్లో పట్టించుకోని టీడీపీ

బ్రిటిష్ కాలం నుంచి అవే ఆస్పత్రులు సేవలు అందిస్తున్నా టీడీపీ హయాంలో ఎవరూ స్పందించలేదనడానికి వెంకటాపురం పీహెచ్‌సీ ప్రత్యక్ష ఉదాహరణ. వజ్రపుకొత్తూరు మండలం వెంకటపురంలో బ్రిటిష్ వారు విడిదిగా ఒక గదిని నిర్మించారు. కాలక్రమేణా అది డిస్పెన్సరీగా మారింది. 2009 తర్వాత పీహెచ్‌సీగా రూపాంతరం చెందింది. అయితే 2015–16లో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ ఈ ఆస్పత్రిని ఎత్తేసి బ్రాహ్మణతర్లాకు తరలించాలని ఆదేశించారు. స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన చేసి ఆస్పత్రిని కాపాడుకున్నారు. అప్పట్లో పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానికులు దీనిపై విన్నించడంతో కొత్త ఆస్పత్రిపై ఆయన మాటిచ్చారు. ఆ హామీ ప్రకారం రూ.1.85 కోట్లతో పీహెచ్‌సీ నిర్మించారు. ఈ ఆస్పత్రి ఆంధ్రాతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల వారికి కూడా ఉపయోగపడుతుంది.



ఇచ్చిన మాటకు కట్టుబడి..

టీడీపీ నాయకులు మా ఆస్పత్రిని ఎత్తివేయాలనుకున్నారు. వైఎస్సార్ సీపీ వచ్చిన తర్వాత ఇక్కడ కొత్త ఆస్పత్రి కట్టారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి మా గ్రామంలో రూ.1.80 కోట్ల వ్యయంతో ఆస్పత్రి నిర్మించారు. జగనన్నకు, మంత్రి అప్పలరాజుకు రుణపడి ఉంటాం.

– మరడ భాస్కరరావు, పార్టీ కో అప్షన్ సభ్యుడు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రజలకు వరం

ఏళ్ల తరబడి ఉద్దాన,తీర ప్రాంతంలో కిడ్నీ మహమ్మారి జనాలను తినేస్తోంది. ఇలాంటి సందర్భంలో రూ.50 కోట్లు వ్యయంతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిజంగా ఉద్దానం వాసులకు వరం. మా గ్రామంలోనూ రూ.1.80 కోట్లతో కొత్త ఆస్పత్రి నిర్మించడం ఆనందంగా ఉంది.

– లండ రామలింగం, మాజీ సర్పంచ్, అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు మండలం.



నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న అక్కుపల్లి పీహెచ్‌సీ